క్లుప్తంగా

ఊటసముద్రం మాజీ సర్పంచ్ మృతి


రమణయ్య

చింతలపూడి : చింతలపూడి మండలం ఊట సముద్రం గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకులు గొట్టిపోళ్ళ రమణయ్య (72) శనివారం మృతి చెందారు. అనారోగ్య కారణంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు. రమణయ్య మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

దివ్యాంగురాలికి త్రిచక్ర వాహనం అందజేత


దివ్యాంగురాలికి త్రిచక్ర వాహనాన్ని అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, వర్గ, పార్టీ భేదం లేకుండా దివ్యాగులకు త్రిచక్ర వాహనాలు అందజేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికి లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ధర్మాజీగూడెం సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న దివ్యాంగురాలైన ముత్తమ్మకు త్రిచక్ర వాహనాన్ని సందీప్, సురేష్ అందజేశారు. దివ్యాంగులకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ మోహన్‌రావు

బుట్టాయగూడెం: మండలంలో బొత్తప్పగూడెం నుంచి కోయ రాజమండ్రి వరకు చేపట్టి రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు పరిశీలించారు. అనంతరం శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు రూ.కోటీ 20 లక్షల వ్యయంతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే బొత్తప్పగూడెం నుంచి రావిగూడెం శివారు వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రెండో విడత కోయ రాజమండ్రి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

ద్వారకాతిరుమల: ముర్రుపాలు పట్టిన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం తెలిపారు. మండలంలోని రామసింగవరం, గుండుగొలనుకుంట గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించడం వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయ నిర్మల, జగదీశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అంజన్న కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి జన్మ నక్షత్రం పూర్వాబాధ్ర నక్షత్రం సందర్భంగా మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి క్షేత్రంలో శనివారం సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు వేద మంత్రాలతో కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. స్వామివారి మూలవిరాట్‌కి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆదాయం రూ.1,04,350 వచ్చినట్లు 850 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన

కామవరపుకోట: ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ రెండు నెలల క్రితం జరిగిన బదిలీలు, ప్రమోషన్స్ పొందిన టీచర్స్‌కు వెంటనే జీతాలు చెల్లించాలని, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళాదేవి, మల్ల నాగేశ్వరరావు, బలరాం, ధర్మేష్, కరిముల్లా, కమలాకర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం సీతప్పగూడెం సచివాలయ పరిధిలోని కొల్లాయిగూడెం, బుద్దులవారిగూడెం, కట్టుపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు వృద్ధులను పింఛన్లు అందుతున్నాయా? అని ఆరా తీశారు. కొంతమంది గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పని చేస్తుందని అన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మొడియం రామతులసీ, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు మొడియం వెంకమ్మ, ఉప సర్పంచ్ సరియం చల్లయ్య, సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్యదుర్గా ప్రసాద్, పార్టీ నాయకులు దినేష్, తెల్లం దేవరాజు, సోదెం సుధాకర్, ఎంపీడీవో వేణు గోపాల్‌రెడ్డి, ఎంఈఓ బాబూరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


బుద్దులవారిగూడెంలో వృద్ధురాలితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

సంక్షేమం చూసి ఓర్వలేకే దౌర్జన్యాలు

చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వం, ప్రజలపైనా దౌర్జన్యాలు చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శనివారం మండలంలోని రావికంపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి అసంతృ వ్యక్తం చేశారు. మరోపక్క విద్యార్థులు టేబుల్స్‌పై కూర్చోకుండా కింద కూర్చోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, మరలా ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని, ఉపాధ్యాయులను హెచ్చరించారు. అనంతరం గడపగడపకు తిరుగుతూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చి ప్రజల మననాలను పొందుతుందన్నారని అన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీకి ప్రజా ఆధారణ తగ్గి, మనుగడ లేదని గ్రహించి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు విపరీతమైన నిరాశ నిస్పృహలతో వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా చేసుకోని తెలుగుదేశం పార్టీ వారిని రౌడీలుగా మార్చి మారణ ఆయుధాలతో దౌర్జన్యాలకు పాల్పడేలా పురిగొల్పుతున్నారన్నారు. పుంగనూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులపై దౌర్జన్యం చేయటమే దీనికి నిదర్శనమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లూ విజయం సాధించి మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, షేక్ మీరా సాహెబ్, ప్రసాద్ రెడ్డి, రాయంకుల సత్యనారాయణ, నల్లూరి ప్రభాకర్‌రావు, వెర్రి శ్రీను, పండు పాల్గొన్నారు.


రావికంపాడులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

వరద ప్రభావిత గ్రామాల్లో సూపర్ శానిటేషన్

కుక్కునూరు: గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో సూపర్ శానిటేషన్ పనులు చేపట్టినట్లు నూజివీడు డివిజినల్ పంచాయతీ అధికారి ఎంపీఎస్ సుందరి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం నలుగురు ఈవోపీఆర్డీలు, 23 మంది పంచాయతీ కార్యదర్శులు, 32 మంది పారిశుద్ధ్య కార్మికులను పంపినట్లు చెప్పారు. వీరు మండలంలోని 15 పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుండి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయని చెప్పారు. ఆమె వెంట కుక్కునూరు ఈవోపీఆర్డీ మోహన్, నూజివీడు డివిజన్‌కు చెందిన ఈఓపీఆర్డీలు విక్టర్, ముసునూరు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది


కుక్కునూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వరద బాధితులు

వరద పరిహారం కోసం వినతి

కుక్కునూరు: గతేడాది సంభవించిన గోదావరి వరద పరిహారం చెల్లించాలని కోరుతూ కుక్కునూరు, రామచంద్రాపురం గ్రామానికి చెందిన బాధితులు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గోదావరి వరద ముంచెత్తిన అనంతరం సర్వేకు వచ్చిన సిబ్బంది కూలిన పూరి, తాటాకిళ్లను సర్వే చేసి పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. కానీ తరువాత ప్రకటించిన జాబితాలో కొంతమంది బాధితుల పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మరల దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. మరికొంతమంది పేర్లు వచ్చినా వారి బ్యాంక్ ఖాతాల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. మరోమారు బ్యాంక్ ఖాతా నెంబర్‌లు అధికారులు తీసుకున్నప్పటికీ నేటికీ పరిహారం జమ చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని మల్లేల చంటినాయుడు, కుక్కునూరు, రామచంద్రాపురం గ్రామానికి చెందిన బాధితులు కోరారు.

బాల్య మిత్రుల ఔదార్యం

బుట్టాయగూడెం: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాల్య మిత్రుని కుటుంబాన్ని స్నేహితులు ఆదుకుని తమ ఔదార్యం చాటుకున్నారు. బుట్టాయగూడెం మండలం తాడితోటకు చెందిన తోడం కన్నపరాజు కరోనాతో చనిపోవడంతో ఆ కుటుంబానికి అతని బాల్య స్నేహితులు అండగా నిలిచారు. భార్య కనకమ్మ ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్న సమయంలో మిత్రులు ఆమెకు రూ. 25,000 సహాయం అందించి కౌలు వ్యవసాయం చేసుకునే విధంగా ఆమెను ప్రోత్సహించారు. అలాగే కోయరాజమండ్రికి చెందిన బి.రామోజీ అనే స్నేహితుడు కూడా మృతి చెందితే ఆ కుటుంబానికి కూడా రూ. 35,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే ఏపులపాడుకు చెందిన చోడెం మల్లయ్య అనే స్నేహితుడికి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో రూ. 33,000 సహాయాన్ని ఈ స్నేహితులు అందించారు. ఇలా 10వ తరగతిలో తమతో కలిసి చదువుకున్న స్నేహితులకు ఎటువంటి ఆపద వచ్చినా మేమున్నామంటూ ఈ బాల్య మిత్రులు ఆ కుటుంబాలకు అండగా ఉంటున్నారు.


ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు తెల్లం గంగరాజు, బుద్దుల లక్ష్మణరావు తదితరులు

ప్రమాదవశాత్తూ వృద్ధుడి మృతి

చింతలపూడి: బోరుబావి తవ్వుతుండగా ప్రమాద వశాత్తూ ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం, గంగారం గ్రామానికి చెందిన చిమట వెంకటేశ్వరరావు(52) బోరు బావులు తవ్వే పనికి వచ్చాడు. బోరు బావి తవ్వుతుండగా కేసింగ్ పైప్ దింపుతున్న సమయంలో వెంకటేశ్వరరావు చొక్కా యంత్రానికి చిక్కుకుని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి తరలించారు. ఎస్సై కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోతునూరు సొసైటీ పాలకవర్గ నియామకం

చింతలపూడి: చింతలపూడి మండలం పోతునూరు సహకార సంఘం చైర్మన్‌గా కందుల గోవర్ధనరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ డైరెక్టర్లుగా పింగిలి ఏసు, జుబ్బూరు దుర్గారావులను నియమించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ గోవర్ధన రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీసాతో వ్యక్తిపై దాడి

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి సీసాతో దాడి చేసిన ఘటనలో గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టి.నరసాపురం మండలం మల్లుకుంటకు చెందిన గొర్రెల కాపరి నరదల వెంకటేశ్వరరావు శనివారం వెంకటేశ్వరరావు, ఉదయం 10 గంటల సమయంలో జంగారెడ్డిగూడెం మైత్రి బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చి అక్కడ తాను మద్యం సేవిస్తున్నట్లు అతని కుమారుడు శేఖర్‌కు ఫోన్‌లో చెప్పాడు. దీంతో శేఖర్ త్వరగా ఇంటికి వచ్చేయమని చెప్పాడు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎవరో ఒక వ్యక్తి తన తండ్రి సెల్‌ఫోన్ ద్వారా ఫోన్ చేసి తన తండ్రి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో శేఖర్ అతని బాబాయి కొడుకు అనిల్‌కుమార్‌తో జంగారెడ్డిగూడెం వచ్చి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వెంకటేశ్వరరావుకు వైద్యులు చికిత్స చేశారు. అయితే వెంకటేశ్వరరావు మద్యం సేవించిన తరువాత పట్టణానికి చెందిన ఒక కారు డ్రైవర్ సీసాతో దాడి చేశాడని, దీంతో వెంకటేశ్వరరావు ఎడమ దవడ వద్ద తీవ్ర గాయమై రక్తస్రావమైనట్లు చుట్టుపక్కల వారు తెలుపుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉంటే తన తండ్రి వెంకటేశ్వరరావు తనకు ఫోన్ చేసిన సమయంలో తన వెంట రూ. 1.50 లక్షలు తీసుకువస్తున్నానని చెప్పాడని, అవి కనిపించడం లేదని, కేవలం రూ. 5వేలు మాత్రమే తన తండ్రి వద్ద ఉన్నాయని కొడుకు శేఖర్ తెలిపాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం పట్టణంలోని పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్, సూరపురాజుగూడెం కాలనీ, రామచంద్రాపురం, లక్ష్మీగణపతి నగర్, ఏలూరు రోడ్, మసీద్ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేతవరంలో కోడి పందేలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కేతవరం వెంకటేష్ చెరువు ప్రాంతంలో నిత్యం యథేచ్ఛగా కోడి పందేలు జరుగుతున్నాయి. పందేల జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు. కోడి పందేల వల్ల యువత ఆర్థికంగా నష్టపోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తిమ్మాపురంలో వద్ద అదుపుతప్పి పడిపోవడంతో ఓ మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం మండలంలోని చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు మోటార్ సైకిల్‌పై శనివారం అశ్వారావుపేట మండలం వినాయకపురం వైపు వెళుతున్నాడు. అయితే తిమ్మాపురం రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి కింద పడిపోయాడు. గాయపడిన అతనిని స్థానికులు గమనించి చికిత్స కోసం అశ్వారావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బంధువులు స్వగ్రామమైన చక్రదేవరపల్లి తీసుకొచ్చారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.50 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ. 1,50,000 లను విరాళంగా అందజేశారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లికి చెందిన పెదపూడి తులసి వెంకట కేశవకుమార్ ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మణిపూర్ క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

లింగపాలెం: మణిపూర్ క్రైస్తవులకు రక్షణ, స్వేచ్ఛ కల్పించాలని రెవ. పాస్టర్ హెచ్చు ఏసురత్నం కోరారు. లింగపాలెం మండలం పాశ్యానగరం విచారణ ఆధ్వర్యంలో శనివారం క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపదేసి పాస్టర్లు, ఉపదేశులు ,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కామవరపుకోట: ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కడిమి రమేష్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీలో భాగంగా తడికలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో రమేష్ ఆధ్వర్యంలో, కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ కరిపోతు అనూష ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు రేషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కామవరపుకోట, తడికలపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంగాదేవి, మీరాకుమారి, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, గంగులు కడియాలు, కొప్పర్తి లక్ష్మి, మేడంకి పద్మ, పోలిమెట్ల ప్రశాంత్ పాల్గొన్నారు.


రేషన్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రమేష్

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ కోరారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు కిట్లను అందించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఎల్. వెంకటేశ్వరరావు, సీహెచ్ అచ్యుత రామయ్య, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్ వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోడిగూడెంలో..

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ శనివారం ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు కిట్ల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుబోయిన సత్యనారాయణ, తేలే నాగ శ్రీను, చల్లా సుబ్బారావు, జక్కు శ్రీరామమూర్తి పాల్గొన్నారు. దిప్పకాయలపాడు, కన్నాపురం, మంగపతిదేవిపేట, అంకాలగూడెం గ్రామాల్లో టీహెచ్ఆర్ కార్యక్రమం నిర్వహించారు.

నాటి పాలకుల తప్పిదం.. నేడు రైతన్నలకు తీరని నష్టం

కొయ్యలగూడెం: వరదనీటితో ముంపులో ఉన్న తమ చేలను రక్షించాలని వేదాంతపురం–రామానుజపురం గ్రామాల రైతులు వేడుకుంటున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న మర్రికుంట చెరువు నుంచి వరద నీరు పంటచేలను ముంచెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఐదు సంవత్సరాల క్రితం మర్రికుంట చెరువుకు అవసరం లేకపోయినా బాడీ వాల్ నిర్మించారన్నారు. గతంలో ఉన్న దానికంటే రెండు అడుగుల మేర ఎత్తు పెంచి కట్టారని, దానివల్ల వరద నీరు వెనక్కి తన్ని సుమారు 25 ఎకరాలకుపైగా వ్యవసాయ భూములను ముంచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాడీ వాల్ నిర్మాణాన్ని చెరువు ఆయకట్టు రైతులు వ్యతిరేకించినప్పటికీ పట్టించుకోలేదని, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ఇప్పుడు దాని ఫలితం తాము అనుభవిస్తున్నామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ వరద నీరు చేలలోనే ఉండిపోయిందని, దీంతో వరి నాట్లు వేసిన చేలు కుళ్ళిపోతున్నాయని తెలిపారు. 'స్పందన'లో రైతుల తరపున వెళ్లి ఫిర్యాదు చేశామని, బాడీ వాల్ నిర్మాణం తొలగించాలని కలెక్టర్ ఆదేశించారని, ఇదే విషయాన్ని జగనన్న సురక్షలో కూడా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారని సర్పంచ్ గేలం త్రివిక్రమ సోమరాజు, సొసైటీ అధ్యక్షుడు చిల్లర రామారావు చెప్పారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు పెదపూడి మోహనరావు, పారేపల్లి సత్యనారాయణ, పోలనాటి శ్రీను, అడప వీర్రాజు, కంకిపాటి దుర్గారావు, నెరుసు శ్రీను, నెర్సు రామారావు, వంకాయల రామకృష్ణ, వామిశెట్టి నాగ శ్రీను తదితరులు కోరుతున్నారు.


చేల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కొయ్యలగూడెం: మండలంలో వేర్వేరు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన, తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం శనివారం వేకువజామున కొయ్యలగూడెం మీదుగా జీలుగుమిల్లి మండలం నుంచి కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని కోళ్ల ఫారాలకు అక్రమంగా వ్యానులో తరలిస్తున్న 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోతుల సత్తిబాబుపై కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.72 వేలు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా కన్నాపురంలో గ్రంధి శ్రీనివాసరావుకి చెందిన గోడౌన్‌లో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని , వీటి విలువ రూ.36 వేలు ఉంటుందని పేర్కొన్నారు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, వీఆర్ఓ అడపా రామ్మోహన్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కొబ్బరి రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

చింతలపూడి: మండలంలోని అల్లిపల్లి గ్రామంలో కొబ్బరి పరిశోధన స్థానం అంబాజీపేట శాస్త్రవేత్తలు శనివారం కొబ్బరి తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా కొబ్బరి తోటల్లో ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.అనూష, డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, ఏలూరు ఉద్యానవనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.శాంతి, చింతలపూడి ఉద్యానవన శాఖాధికారిణి ఎండీ షాఫీయా ఫర్హీన్ పాల్గొన్నారు.


అల్లిపల్లిలో కొబ్బరి తోట వద్ద రైతులతో శాస్త్రవేత్తలు

యాజమాన్య పద్ధతులపై అవగాహన

కామవరపుకోట: కొబ్బరిలో ఆశించే తెగులు, కీటకాల నివారణకు హెక్సోకొనజోల్ ఎంతో ఉపయోగపడుతుందని అంబాజీపేట కొబ్బరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, డాక్టర్ వి.అనుష సూచించారు. శనివారం మండల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో తడికలపూడిలోని రైతులకు కొబ్బరిలో ఆశించే తెగులు, కీటకాలు నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఏడీహెచ్ శాంతి, ఉద్యాన శాఖ అధికారి లక్‌పతి, ఉద్యానవన శాఖ సహాయకులు ప్రేమ్, నాగబాబు, విష్ణు, సింధూర పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

చింతలపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ మురళీకృష్ణ పిలుపునిచ్చారు.స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో యర్రగుంటపల్లి, కె గోకవరం, రాఘవాపురం పీహెచ్‌సీల పరిధిలోని వైద్య సిబ్బందికి శనివారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆగస్టు 10న ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించడం ద్వారా పిల్లల్లో రక్త హీనతను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, డా నరేష్, ఐసీడీఎస్ పిఒ పి మాధవి, ఎంఈఓ జి రామారావు,ఆరోగ్య విస్తరణాధికారులు ఎస్‌కె అబ్రార్ హుస్సేన్,పి శ్రీనివాసరావు, లీల పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాలని డాక్టర్ నరేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.